
# వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఆదివారం 27 ఏప్రిల్ 2025


## రాజంపేట రెవిన్యూకు ఫోన్ బెదిరింపు పై కలెక్టర్ ఆరా

**నివేదిక పంపిన తాసిల్దార్**

**నిఘా వర్గాలు ఆరా**

**రాజంపేట అర్బన్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

రాజంపేట మండలంలో ఓ రెవెన్యూ అధికారిని దుర్భాషలాడి బెదిరించిన వ్యవహారంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సీరియస్గా పరిగణించారు. జరిగిన వ్యవహారంపై రాజంపేట తాసిల్దార్ పీర్ మున్నీని నివేదిక కోరినట్లు తెలిసింది. జాయింట్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ కూడా ఈ వ్యవహారంపై స్పందించి సమస్యను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఖివార్త ఖిశనివారం ఖిరాజంపేట రెవెన్యూకు ఫోన్ బెదిరింపు, వెలువడిన కథనంపై కలెక్టర్ స్పందించారు. వాస్తవ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎవరు ఫోన్ చేశారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ఫోన్ చేసి బెదిరించిన వైసీపీ నేత గురించి ఆరా తీశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సీరియస్ గా ఉంటుందని కలెక్టర్ సంకేతాలు పంపినట్లు సమాచారం. కార్యాలయంలోనే గ్రామ రెవెన్యూ అధికారి తనను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని,ఏడుస్తూ తాను ఇక్కడ ఉద్యోగం చేయాలేనని చెప్పిన విషయాన్ని తూచా తప్పకుండా కలెక్టర్కు సమాచారం చేరవేశారు. వీఆర్వోను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి వివరణ కోరారని తెలిసింది. ఫోన్ చేసి బెదిరించింది ఎవరని కూడా పేరు కూడా తెలుసుకున్నారని తెలిసింది. పోలీసు అధికారులు కూడా రాజంపేటలో జరిగిన వ్యవహారంపై ఆరా తీసినట్టు తెలిసింది.

## ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం

**: పలు వార్డులలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్**



**బద్వేలుఅర్బన్ ,ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**

మున్సిపాలిటీలోని పలువార్డులలోని ప్రజలకు మెరు ఇటీవల శివానగర్, మహాబూబ్నగర్, గాంధీనగర్లలో డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్థంగా ఉన్నాయని తెలిసిన సమాచారం మేరకు అక్కడ పర్యటించి కాలువలను పారిశుద్ధ్య సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. అలాగే శివా నగర్లో మంచి నీటి పైపులైన్లో లీకేజీ డ్రైనేజీ వాటర్ వస్తుండడంతో దానిని కనుగొన్న కమిషనర్ త్వరిత గతిన సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. పలువురు ప్రజలు కమిషనర్ స్పందించడంపై శివానగర్ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు..మున్సిపాలిటీలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని, ఎండలు ఎక్కువగా ఉన్నందు వలన ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని దీనిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా నీటి సమస్య రాకుండా వచ్చినా వెంటనే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో**

# పశువైద్యుల సేవ అనిర్వచనీయం

**రాయచోటి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**



మూగజీవాల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవ అనిర్వచనీయమని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పశువైద్యుల సేవలను గౌరవించడం మరియు పశువుల ఆరోగ్య సంరక్షణలో వారి పాత్రను గుర్తించడానికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం రోజున జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయము మరియు పశు పోషణ అని పేర్కొన్నారు. పశు పోషణలో రైతులకు... గొర్రెలు, మేకలు, పందుల మాంసం, కోళ్ల నుంచి గుడ్లు, మాంసం ఉత్పత్తితో పెంపకందారులకు ఆదాయం లభిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొన్ని కోట్ల మూగజీవాలకు పశువైద్య సిబ్బందే కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. పశు ఆసుపత్రుల్లో మందులు పంపిణీ చేయడంతో పాటు వాటి పునరుత్పత్తికి కృత్రిమ గర్భధారణ, శస్త్రచికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, సంచార వాహనాల ద్వారా పశువులకు ఇంటి వద్దే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు అన్నారు. మూగ జీవాలను చీదరించుకోకుండా విశిష్ఠ సేవలు అందిస్తున్న పశువైద్యులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మధుసూదన్ రావు మాట్లాడుతూ పశు వైద్యులు కేవలం జంతు వైద్యులు మాత్రమే కాదని, ప్రజారోగ్య రక్షణలో ఫ్రంట్ లైన్ వారియర్స్ అని కొనియాడారు. పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజారోగ్యం బాగుంటుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలు మరియు పశువులు కలిసి జీవించడం జరుగుతుందని, పశువుల ఆరోగ్యం బాగుంటేనే గ్రామీణ ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. తనకు స్వతహాగా మూగజీవాలంటే ప్రేమ అని, తనకు కూడా పశు వైద్య అంటే ఇష్టమని అయితే అనుకొని పరిస్థితులలో రెవెన్యూ శాఖ అధికారిగా పనిచేస్తున్నానన్నారు. మూగజీవాలు కేవలం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మాత్రమే సేవలందించడం లేదని, పోలీసు శాఖ అధికారులకు శాంతి భద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణలో ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్నందుకు, మరియు వాటి సంరక్షణ మరియు పోషణలో భాగమైనందుకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం పశువైద్య దినోత్సవాన్ని .."యానిమల్ హెల్త్ టేక్స్ ఎ టీం.." అనే దీంతో జరుపుకుంటున్నామన్నారు. మహాత్మా గాంధీ చెప్పినట్లుగా ఒక దేశ నైతిక అభివృద్ధి ఆ దేశ పశువుల పట్ల ప్రజలు ప్రవర్తించే విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏ దేశమైనా ఆర్థిక అభివృద్ధి తో పాటు నైతిక అభివృద్ధి సాధించినప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించబడుతుందన్నారు. నైతిక అభివృద్ధి సాధించాలంటే పశువుల పట్ల మానవతా దృక్పథంతో ఉండాలనన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మూగజీవాలకు సేవలు అందించడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. జిల్లాలోని పలు పశు వైద్యశాలలలో టాయిలెట్లు సరిగా లేవని, వాటికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని కోరారు. ఈ సందర్భంగా అత్తిరాల పశు వైద్యురాలు డాక్టర్ భాగ్యవతి మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితులలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైన నేపథ్యంలో మూగజీవాలు మనుషులకు అండగా నిలుస్తున్నాయని, వాటికి సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై, మదనపల్లి, రాజంపేట, రాయచోటి ఉపసంచాలకులు సత్యనారాయణరావు, విజయభాస్కర రావు,విజయకుమార్, మరియు సహాయ సంచాలకులు, జిల్లాలో పనిచేస్తున్న పశు వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్హెచ్ఎంఎస్ను సద్వినియోగం చేసుకోండి

**సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంటతీసుకెళ్లాలి**

**డిఎస్పి ఎస్.మహేంద్ర**



**మదనపల్లెక్రైం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

వేసవిసెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు లాక్డ్హౌస్ మేనేజింగ్ సిస్టమ్ (ఎల్హెచ్ఎంఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె డిఎస్పి ఎస్.మహేంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పిల్లలకు పరీక్షకాలం పూర్తికావటంతో చాలమంది సొంత ఊర్లకు వెళ్లటం సహజమన్నారు. అలా ఊర్లకు వెళ్లేవారు వారి ఇంట్లో వున్న విలువైన వస్తువులు బంగారం, డబ్బులు భద్రపరుచుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళంవేసి వెళ్లేవారు ముందుగా తమకు సమాచారం ఇస్తే ఆ ఇంటి వద్ద పోలీస్ నిఘా ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. దీనివల్ల దొంగతనాలు జరగకుండా చేయటానికి వీలౌతుందన్నారు. ప్రజల సహకారం వుంటే నేరాల నియంత్రణ సులువుతుందన్నారు. అలాగే చిన్నారులు సెలవుల్లో ఈత అడటానికి బావుల వద్దకు వేళ్లే సమయంలో తల్లిదండ్రులు ఖచ్చితంగా వెంట వెళ్లాలని కోరారు. ముందుజాగ్రత్త చర్యగా బావులు, చెరువులు, నీటి కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలో బ్లాక్ స్పాట్ను గుర్తించి సైన్బోర్డులు ఏర్పాటు చేయటం, వాహనాలు నడిపే మైనర్లపై కేసులు నమోదు చేయటం, మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనాలను సీజ్ చేసి, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కువ శబ్దం వచ్చేలా సైలసర్లు ఏర్పాటు చేసిన వాహనాలను ఖచ్చితంగా సీజ్ చేస్తామన్నారు. వాహనాలకు ఫీట్లు చేసేవారిపై కేసులు నమోదు చేయటంతో పాటు, భారీ జరిమాన విధిస్తామన్నారు. రౌడీషీటర్లను ప్రతి మంగళవారం స్టేషన్ను పిలిచి కౌన్సిలింగ్ చేసే ప్రక్రియ మొదలు పెట్టామన్నారు. రౌడీషీటర్లు సెటిల్మెంట్, దందాలు చేస్తే జైలుకు పంపుతామన్నారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. గతంలో గంజాయి విక్రయాలు చేసి జైలుకు వెళ్లినవారికి కౌన్సిలింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. వారి ద్వారా గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది ఆరా తీసి ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్య వుందని, దీనికోసం పగటిపూట హైవీ వెహికల్స్ను పట్టణంలోకి రాకుండా నిలుపుదల చేశామన్నారు. ప్రతిరోజు రెండు గంటల పాటు వాహన తనిఖీలు చేసేలా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని డిఎస్పి కోరారు.

## వివేకా కేసులో రంగంలోకి దిగిన సిట్

**సాక్షుల మరణాలపై విచారణ వేగవంతం**

**పరమేశ్వర్ రెడ్డి విచారించిన సిట్ బృందం**

**విచారణకు రావాలని రంగన్న భార్యకు నోటీసులు**

**పులివెందుల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**


శ్రీనివాస రెడ్డి బావమరిది పరమేశ్వర రెడ్డి ఇంటికి విచారణకు వెళ్తున్న సిట్ బృందం

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారు ఒక్కొక్కరుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పై విచారణ చేపట్టడానికి సిట్ రంగంలోకి దిగింది. వివేకా హత్య కేసులో మొత్తం ఆరుగురు సాక్షులు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల కీలక సాక్షి అయిన రంగన్న మృతితో ఈ కేసును కూటమి ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. వరుసగా సాక్షులు మృతి చెందడం అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇటీవల చనిపోయిన రంగన్న కేసును పోలీసులు తిరగదోడుతున్నారు. రంగన్నకు ముందు వరుసగా సాక్షులైన కె . శ్రీనివాసరెడ్డి 2019 సెప్టెంబర్ మూడవ తేదీన, వైయస్ జగన్ వాహన డ్రైవర్ నారాయణ యాదవ్ 2019 డిసెంబర్ ఆరవ తేదీన, డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఓ ఎస్ భారతి తండ్రి 2020 అక్టోబర్ మూడో తేదీన, గంగాధర్ రెడ్డి 2022 జూన్ నెల, డాక్టర్ అభిషేక రెడ్డి 2025 జనవరి 10వ తేదీన ఐదుగురు సాక్షులు మరణించారు. దీంతో గత కొంతకాలంగా పులివెందులలో సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో సిట్ బృందం విచారణను వేగవంతం చేసింది. పట్టణంలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ రెడ్డి బావ మరిది కసునూరు పరమేశ్వర్ రెడ్డి ఇంటికి శనివారం సిట్ బృందము వెళ్లి ప్రత్యేక వాహనంలో విచారణ కోసం లింగాల పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లారు. అక్కడ సుదీర్ఘంగా విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అలాగే ఈ కేసులో మరో కీలక సాక్షి మృతుడు రంగన్న భార్య సుశీలమ్మను విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు. వివేకా కేసులో సాక్షులుగా ఉన్న వారి మృతి వెనక మిస్టరీ ఏంటి అన్న దానిపై సిట్ అధికారులు ఫోకస్ పెట్టినట్టు తెలుస్తుంది. రంగన్న పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకోనునట్లు తెలియ వస్తోంది.

## రోడ్డుపై వాహనాలు అడ్డంగా నిలిపితే చర్యలు తప్పవు



**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

రోడ్డుపై వాహనాలు అడ్డంగా నిలిపితే చర్యలు తప్పవనీ అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణ లు తెలిపారు. శనివారం గురు కాఫీ కేఫ్ వద్ద వాహనదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇందులో భాగంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ట్రాఫిక్ అంతరాయం ఎక్కువ కలుగుతుందని కావున వాహనదారులు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్ అంతరానికి పాల్పడుతుంద న్నారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకూడదని, ప్రతి ఒక్కరు పోలీస్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని అర్బన్ సీఐ పలువురు తెలియజేశారు, నేషనల్ హైవేలో రోడ్డు దాటుకునేటప్పుడు వాహనాలను గమనిస్తూ అటు ఇటు నెమ్మదిగా దాటుకోవాలన్నారు. ప్రజలకు రక్షణగా పోలీసులు ఎప్పటికీ అందుబాటులో ఉంటారని పోలీస్ సేవలను అవసరమైన సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు

## జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

**స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు**

**తనిఖీల్లో పోలీస్ జాగిలాలు, బాబు స్క్వాడ్ బృందాలు**

**( అన్నమయ్య ప్రతినిధి ప్రభాత వార్త )**

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రజా జీవనానికి ఇబ్బందులు కలగకుండా ఆకస్మిక తనిఖీలు అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం చేపట్టింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ను పోలీసులు చేపట్టారు. జిల్లాలోని రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు, ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసు జాగిలాలు, బాంబు స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ తనిఖీలు జిల్లా పోలీస్ శాఖ చేపట్టింది. అన్నమయ్య జిల్లా ఇంచార్జి ఎస్పీ ఇ.జి. అశోక్ కుమార్ ఆదేశాలమేరకు, జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి సూచనల మేరకు, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కొరకు మరియు నేరాలను నియంత్రించుటకు, ప్రజలకు పోలీసులు రక్షణగా ఉన్నారనే భరోసా కల్పించేందుకు విస్తృత తనిఖీలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతున్నట్టు సమాచారం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలలో ఆయా పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ముఖ్యమైన కూడళ్ళు, జిల్లాలోని నేషనల్ హైవేస్, బోర్డర్ చెక్పోస్టులు ,లాడ్జిలు మరియు అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పద వ్యక్తుల ఆధార్ కార్డులను కూడా తనిఖీ చేయడం జరుగుతున్నది. ముఖ్యంగా పోలీసు జాగిలాలు మరియు బాంబు స్క్వాడ్ బృందాలతో రైల్వే స్టేషన్, బస్టాండ్లలో నిషేధిత వస్తువులు గంజాయి, అక్రమ మద్యం, పేలుడు పదార్థాలు, మొదలగు వాటిని అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలలో సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిఐలు, ఎస్ఐలు, ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది హోంగార్డులు పాల్గొంటున్నారు.

## ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**

ఇటీవల కశ్మీర్ పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అ దాడి ఘటనలో మరణించినా సోదర సోదరీమనుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రొద్దుటూరు నివాసి భారతీయ సంస్క ృతి మరియు నాటకా రంగా అకాడమీ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ వన్ టౌన్ లో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో భారతీయ సంస్క ృతి మరియు నాటక రంగా అకాడమీ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్, రాష్ట్ర సంగీత కళాకారుల సంఘం అధ్యక్షురాలు షేక్ మీరాబీ మరియు తెలంగాణ రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షులు చిన్నారావు తదితురులు పాల్గొని నీరసన తెలియచేసారు.దాదాపు ఒక కిలోమీటర్ దూరం ఈ ర్యాలీ నిర్వహించారు.




**అంతర్ జిల్లాల దొంగల**

## ముఠాను పట్టుకున్న పోలీసులు

**పలు చోరీ కేసులలో 6 మంది అరెస్టు**

**20 తులాల బంగారం, 248 గ్రాముల వెండి స్వాధీనం**

**పులివెందుల,ఏప్రిల్26, ప్రభాత వార్త:**

పులివెందల ప్రాంతంలో జరుగుతున్న వరుస దొంగతనాలలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పోలీసులు అంతర్ జిల్లాల చోరీదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా చోరీలు చేస్తున్న 6 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 తులాల బంగారం 248 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నామని పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ తెలిపారు. శనివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఉలిమెల్ల రింగ్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా దొంగతనాల కేసులో ముద్దాయిలుగా ఉన్న ఆరుగురు రెండు మోటార్ సైకిల్ వెళుతుండగా అర్బన్ సీఐ చాంద్ భాషా సిబ్బందితో కలిసి వారిని అరెస్టు చేశారన్నారు. జిల్లాలో 12 కేసులలో ముద్దాయిలుగా ఉన్న వల్లెపు నవీన్, కత్తులూరు గణేష్ , మంజుల గంగాధర్, కొమ్మెర రాజశేఖర్ , వల్లెపు గంగాధర్, వల్లెపు వెంకటచంద్ర, మహేష్ అరెస్ట్ చేశారు. వీరు పులివెందుల , ఎర్రగుంట్ల, కలమల్ల బద్వేలు ప్రాంతాలలో తాళాలు వేసిన ఇళ్లను అనువుగా చూసుకొని దొంగతనాలకు పాల్పడం జరిగిందని తెలిపారు. బంగారు, వెండి ఆభరణము లతో పాటు రెండు మోటార్ సైకిల్ , ఒక టీవీని రికవరీ చేయడం జరిగినదని తెలిపారు. త్వరలో విజయా హోమ్స్ లో కూడా దొంగతనం కాబడిన సొమ్మును రికవరీ చేస్తామని ఆయన తెలిపారు. దొంగలను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి, నూర్ భాషా, రామ్ రమేష్, ఎల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడం జరిగిందన్నారు. వీరికి త్వరలో రివార్డ్ మనీని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## హైవేపై రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆర్సీసీ పైపులను తొలగించాలి

**సంబేపల్లి ఏప్రిల్ 27 ప్రభాతవార్త;**



మండల పరిధిలోనే నారాయణ రెడ్డి పల్లె నరసయ్య వద్ద జాతీయ రహదారికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్ సి సి పైపులను తొలగించాలని శనివారం సంబేపల్లి తాసిల్దార్ కు మైనార్టీ హక్కుల సంఘం నాయకులు సాజీర్ వినతి పత్రం అందజేశారు కడప చిత్తూరు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నారాయణరెడ్డి పల్లె గ్రామం నేషనల్ హైవే సర్వేనెంబర్ 68 నర్సరీ దగ్గర ఆర్ సి సి పైపులు నిలువ చేయడం జరిగిందని పేర్కొన్నారు ఈ పైపులు నిలువ చేసి ఉన్న స్థలం ప్రభుత్వ స్థలం అని పైపులు తయారు చేయడానికి ఎటువంటి అనుమతులు లేవని వీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు

## ములకలచెరువులో విషాదం

**చెరువులో మునిగి నలుగురు మృతి**

**మదనపల్లి క్రైమ్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త.**

ములకలచెరువు మండలంలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పాత మొలకలచెరువులోని పెద్ద చెరువులో ఈతకు వెళ్లిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఒక యువకుడు, మరో బాలిక ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, లావణ్య (12), నందకిషోర్ (10) అనే ఇద్దరు పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి బట్టలు ఉతకడానికి చెరువు వద్దకు వచ్చారు. వారు చెరువులోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు మునిగిపోతూ కేకలు వేశారు. వారి కేకలు విన్న లావణ్య తండ్రి మల్లేష్ (36) వెంటనే వారిని రక్షించడానికి ప్రయత్నించగా ఆయన కూడా నీటిలో మునిగిపోయారు. వీరితో పాటు చెరువు వద్దకు వచ్చిన పక్కింటి చిన్నారి నందిత (11) కూడా ఈ ప్రమాదంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంటనే మొలకలచెరువు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికి తీశారు. మృతి చెందిన వారిని మల్లేష్ (36), లావణ్య (12), నందిత (11), నందకిషోర్ (10)గా పోలీసులు గుర్తించారు. ఈ దుర్ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## తీవ్రవాదం నశించాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :


కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న పాత్రికేయులు

ఉగ్రవాదం నశించాలని ప్రొద్దుటూరు పాత్రికేయులు నినదించారు. శనివారం స్థానిక శ్రీరాములపేట లోని ప్రెస్‌క్లబ్ వద్ద వారు కోవత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ అమాయకులైన ప్రజలను ఉగ్రదాడిలో పొట్టన పెట్టుకోవడం చాలా బాధాకరమని, జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పెహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు. అదేవిధంగా ప్రశాంతంగా ఉన్న జమ్ముకశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టించి తద్వారా భారత దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అమాయకులైన ప్రజలను ఉగ్రదాడిలో పొట్టన పెట్టుకోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఇటువంటి చర్యలను భారత్ గట్టిగా తిప్పికొట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన నాయకులు

రాయచోటి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:



రామాపురం మండలం, గంగనేరు సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీకొని 14, మందికి గాయాలయ్యాయి గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను శనివారం ఉదయం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి మీకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలి

తొండూరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త:



ప్రకృతి వ్యవసాయం పై మండలం లోని వ్యవసాయశాఖ మరియు వెలుగు డిఆర్‌డిఎ శాఖలతో సమన్వయ సమావేశంఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మండలకేంద్రంలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించడం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు వెలుగు సిబ్బంది అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరడమైనది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ రెడ్డి ఏపిఎం వెంకటనారాయణ మాస్టర్ ట్రైనర్ కే. నాగసుబ్బరాయుడు యూనిట్ ఇంచార్జ్ సుదీర్ కుమార్, మెంటారు పావని, సీసీలు ఆంజనేయులు, వీరమోహన్, జిలాని అకౌంటెంట్ హరి ఆర్ఎస్‌కె ఇంచార్జి సతీష్, ఐసిఆర్‌పిలులు, ఎన్ఎఫ్ఐలు, ఎమ్మెస్‌ఓబిలులు వివోఏలు ప్రకృతి వ్యసాయ రైతులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న కదరమ్మ అనే గర్భిణీ మహిళకు రక్తం తక్కువ ఉండటంతో డెలివరీ కొరకు B+ పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా వారు మేఐహెల్ప్యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి స్టూడెంట్ బ్లడ్ గ్రూప్ సభ్యుడు అయినటువంటి ఆనంద్ చేత స్థానిక ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ నందు బి పాజిటివ్ రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్,వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. రక్తదాత అయినటువంటి ఆనంద్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రూ. 1.50 లక్షలతో వెండి కిరీటాలు వితరణ

పెనగాలూరు ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

పి కొత్తపల్లిలోని కోదండ రామస్వామి దేవాలయంలో గల మూల మూర్తులకు ఇదే గ్రామానికి చెందిన దువ్వూరు లక్ష్మీదేవి రాఘవరెడ్డి దంపతులు 1.50 లక్షలరూపాయలతో సీతారామ లక్ష్మణ ఆంజనేయులకు వెండి కిరీటాలు చేయించి శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులకు అప్పగించి మూల మూర్తులకు అలంకరించినట్లు గ్రామ పెద్ద మీగడ విశ్వనాథరెడ్డి తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తొండూరు ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):



స్థానిక తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామంలో నివసిస్తున్న బొగ్గుల పెద్ద గంగిరెడ్డి వయస్సు 67 సంవత్సరాలు అగడూరు రోడ్డు నందు గల తన తోట వద్దకు ఉదయం 6 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొని తల నుజ్జునుజ్జయింది ఈ ప్రమాదంలో పెద్ద గంగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. సంఘటన జరిగిన తర్వాత పులివెందుల ఏరియా ఆసుపత్రిలో పోస్టుమ్మార్ట చేశారు. ఈ విషయంపై తొండూరు మండలం ఎస్సై గణ మద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

వాల్మీకిపురం ఏప్రిల్ 26 ప్రభాతవార్త :


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పహల్గామ్లో భారతీయ పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేఖంగా కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా యువత, ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం మండలంలోని చింతపర్తి పురవీధుల్లో సర్వంచి మహితా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసన ర్యాలీని ఉద్దేశించి విశ్రాంత ఉపాధ్యాయులు నజీర్, శేషాద్రిరెడ్డిలు మాట్లాడుతూ పహల్గామ్లో జరిపిన ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని ఎద్దేవా చేశారు. ఈ దాడి అమాయకులైన పర్యాటకులపై జరగడం బాధకరమన్నారు. ఈ సంఘటన యావత్తు భారతీయులను ఉలిక్కి పాటుకు గురి చేసిందన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకునేందుకు భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు తదుపరి చింతపర్తిలో కొవ్వొత్తులను చేతపట్టి నిరసన ర్యాలీ నిర్వహించి, మృతుల ఆత్మకు శాంతికలగాలని పది నిమిషాల పాటు మోనం ఖిపాటించారు. ఈ కార్యక్రమంలో రాజకీయపార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మేఘనను సన్మానిస్తున్న ఎంపీపీ

రాయచోటి ఏప్రిల్ 26 ప్రభాతవార్త



వీరబల్లె మండలం పెద్దివీడు గ్రామం పెద్దహరిజన వాడకు చెందిన మేఘన రెడ్డి వారిపల్లి ZPH స్కూల్‌లో చదివి రాష్ట్ర స్థాయిలో 600 గాను 595 మార్కులు సాధించిన కారణంగా వీరబల్లె ఎంపీపీ వారి ఇంటికి పోయి సన్మానం చేసి మన మండలానికి మంచి పేరు తీసుకురావడం చాలా సంతోషం గా ఉందని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలియజేసారు. భవిష్యత్తులో సివిల్స్ రాస్తానని మేఘన తెలుపగా తామంతా పూర్తిగా అండగా ఉంటామని 5000 రూపాయలు ఆ విద్యార్థికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు అన్నమయ్య జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి మరియు సర్పంచ్ నాగిరెడ్డి మరియు గ్రామస్తులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రిమాన్ డ్రై షోయింగ్ పద్ధతిలో

# రైతులకు ఎన్నో ప్రయోజనాలు

మైదుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:



మండలం ఓబుళాపురం గ్రామంలో ప్రిమాన్ డ్రై సోయింగ్ పద్ధతిలో వేసే (పి.ఎం.డి.ఎస్) 30 రకాల విత్తనాలు( పచ్చి రొట్టె, చిరుధాన్యాలు, సుగంధద్రవ్యాలు, ఆకుకూరలు)లతో కూడిన 100 కిట్స్ తయారు చేయడం జరిగింది. ఈ విత్తనాలను ప్రధాన పొలంలో వెదజల్లడం వల్ల వేసవిలో భూమి వేడి తాపాన్ని తట్టుకొని ప్రధాన పంట కావాల్సిన పోషకాలని వీటి ద్వారా రావడంతో పాటు అధిక సాంద్రతతో ఉండడం వల్ల కలుపు నివారణ, భూమి గుల్లబారడం,అకాల వర్షాలకు నేల పైపొర కోల్పోకుండా ఉండడం నీటిని వడిసి పట్టడం జరుగుతుంది. 25 రోజుల నుండి ఆకుకూరలు మనకు లభ్యం అవుతాయి తర్వాత 45 రోజుల తర్వాత ప్రధాన పొలంలో కలియదున్నవచ్చు లేదా పశువులకు మేతగా వాడుకోవచ్చుఇలా చేయడం వల్ల సేంద్రియ ఎరువు అధిక మొత్తం లో అందడంతో పాటు భూమిలో కర్బనం శాతం కూడా పెరుగుతుంది ప్రతి రైతు ప్రధాన పంటకు ముందు ఈ పద్ధతిని పాటించడం వలన ప్రధాన పంటకు ఖర్చు తగ్గించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో పప్పనపల్లిసర్పంచ్ వెంకటలక్ష్మి,ఎంటీ కృష్ణారెడ్డి, యూనిట్ ఇన్చార్జి రామనందరెడ్డి, వెంకట రామయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మద్యంకు బానిసకాకండి

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :


మాట్లాడుతున్న మధుసూదన్

మద్యంకు బానిసై ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవద్దని జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ సూచించారు. శనివారం మదనపల్లె ఎస్టేట్‌లో మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ అధ్వర్యంలో కార్మికులకు అల్కాలిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదన్ మాట్లాడుతూ మద్యపానంకు దూరంగా వుండి ఆరోగ్యకరమైన జీవితానికి నాందిపలకాలన్నారు. మద్యంకు బానిస కావటం వల్ల ఆనారోగ్యానికి గురై ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యారన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవటం వల్ల కార్మికులు మరింత ఉత్సాహంగా పనిచేయగలరన్నారు. ఇందుకోసం ప్రజల్లో అవగాహన కల్పించటం కోసం తాము ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సిఐ భీమలింగ, సోషియల్ వెల్‌ఫేర్ డిప్యూటి డైరెక్టర్ జయప్రకాష్, డిప్యూటి డిఎంఅండ్ హెచ్ఓ రమేష్‌బాబు, వైవిఎస్ ప్రకాష్, డాక్టర్ కిరణ్, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

వాల్మీకిపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నుంచి అంపైర్లు స్కోరర్ల కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకుమార్ (క్రికెట్ విజయ్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు గ్రామస్థాయిలో క్రికెట్ను అభివృద్ధి చేస్తామన్నారు ఇందులో భాగంగా క్రికెట్ను బలోపేతం చేయడంతో పాటు ఎక్కువ సంఖ్యలో మ్యాచ్లను నిర్వహించేందుకు అంపైర్లు, స్కోరర్లకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. మొన్న విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో విజయవాడ ఎంపి ఏసీఏ జిల్లా అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని) రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూరల్ స్థాయి నుంచి క్రికెట్ అభివృద్ధి చేయడమే కాక, క్రికెటర్లకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారన్నారు ఇందులో భాగంగానే ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయకుమార్ తెలిపారు దరఖాస్తులు చేయదలుచుకున్న అభ్యర్థులు కనీసం పదోతరగతి పాసై ఉండాలని వయస్సు 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని క్రికెట్పై మౌళిక అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు పై అర్హతలు కలిగిన అభ్యర్థులు సీడీసీఏ రూపొందించిన గూగుల్ ఫారం ద్వారా 30 ఏప్రిల్ 2025లోపు దరఖాస్తు చేసుకోవాలని విజయకుమార్ సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు: 8886185559, 9000214966లకు సంప్రదించాలని సూచించారు ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపందల చర్య

రాయచోటి ఏప్రిల్ 26 ప్రభాతవార్త



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడిని తిరిగిపంద చర్య అని అత్యంత హేయమైన క్రూరమైన దాడికి పాల్పడిన ముస్కారులను కఠినంగా శిక్షించాలని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు పద్మ యాదవ్ అన్నారు శనివారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై ఉగ్రదాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలను సమస్త సమాజం ఖండించాలని పలువురికి పిలుపునిచ్చారు. అదేవిధంగా శతాబ్రాత్రులకు ఉన్నతస్థాయి వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు ఆమెతోపాటు పలువురు బిసి మహిళలు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రెటరీగా దండ రవి ప్రకాష్

యర్రగుంట్ల ఏప్రిల్ 26 ప్రభాతవార్త



వైఎస్ఆర్సిపి రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రెటరీగా దండ రవి ప్రకాష్ ను నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గతంలో పార్టీ చేసిన సేవలు నాకు ఈ హోదా ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. పార్టీ పెద్దలు నాకిచ్చిన హోదాను వమ్ము కాకుండా చూసుకుంటానని తెలిపారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి పిరికిపంద చర్య

లక్కిరెడ్డిపల్లి ఏప్రిల్ 26 ప్రభాతవార్త

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడి పిరికి పంద చర్య అని, దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని లక్కిరెడ్డిపల్లి ముస్లింల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్ మాట్లాడుతూ హంతక ముఠాల తుపాకి గుండ్లకు బలైన వారికి ప్రగాఢ సంతాపాన్ని ,వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు అమా యకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండ స్తుందని తెలిపారు. ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యల ను సమస్త సమాజం ఖండించాలని పిలుపు నిచ్చారు ఉగ్ర దాడులు జరుగుతున్నాయని ఆక్షేపించారు. ఉగ్రవాదులు ఎక్కడో దాక్కొని అమాయకులైన ప్రజల పైన తుపాకీ తూటాలు ఎక్కు పెట్టడం నీతిమాలిన చర్య అని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్లో శాంతిభద్రతలను పునరుద్దించాలని ఇప్పటికైనా జమ్ము కాశ్మీర్ ప్రజల సమస్యలకు రాజకీయ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిద్ధిగల శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు మన్సూర్, రిజ్వాన్, అహమ్మద్ అలీ, ఫరీద్, సలీం, సాదుల్ల, సర్మాజ్, ముక్తార్ అహ్మద్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం ఇయుతోనే సాధ్యం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త




ఏపియస్ ఆర్టీసి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం తెలిపింది. శనివారం స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో జోనల్ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు డిపో ఇయు అధ్యక్షులుగా బీసీ శేఖర్ కార్యదర్శిగా బివి రమణ, వర్కింగు ప్రెసిడెంటుగా ఆర్.యస్. రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంటుగా వి.రఘునాథరెడ్డి, ప్రచార కార్యదర్శిగా జి.మునికుమార్‌తో పాటు కడప జిల్లా కమిటిలో జిల్లా ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా డి.గోపాల్ ను ఎంపిక చేసినట్లు జోనల్ కార్యదర్శి యన్.రాజశేఖర్ తెలిపారు. ఉద్యోగులకు ఆర్టీసి యాజమాన్యం నుండి రావల్సిన బకాయిలు ఇప్పించడములో అనునిత్యం ఆర్టీసి యం.డి తో మాట్లాడి కృషి చేస్తూ 2017 పి.ఆర్.సి బకాయిలు రూః 800 కోట్లు ఇప్పించినట్లు త్వరలో పెండింగు ఉన్న యస్.ఆర్.బి.యస్/యస్.బి.టి కి సంబంధించిన బకాయిలు, 46 రోజుల ఓటి అలవెన్సును, నైట్ హాల్టు మరియు 2022 నుండి ఇంకా రావల్సిన మంత్లీ ఇన్సెంటివ్ లు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని, హయ్యర్ పెన్షన్ రిజక్టు అయినవారికి, డిమాండ్ నోటీసులు వచ్చి డబ్బులు కట్టలేని వారికి మరోక అవకాశం ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని ఏపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ సమావేశంలో కడప జోనల్ అధ్యక్షులు కె.కృష్ణకుమార్, జోనల్ కార్యదర్శి యన్.రాజశేఖర్, కడప జిల్లా కార్యదర్శి ఏ.రామూర్తి తో పాటు అధిక సంఖ్యలో ప్రొద్దుటూరు డిపో ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టండి

సంబేపల్లి ఏప్రిల్ 26 ప్రభాతవార్త:




గ్రామాలలో నీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ ఆవుల శ్రీ నాగలక్ష్మి తెలియజేశారు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఆవుల నాగ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ రాబోయే రెండు నెలలు మరింత పెరిగే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆమె తెలిపారు అనంతరం ఆర్డబ్ల్యూఎస్‌జేఈ మాట్లాడుతూ మండలంలో 139 స్కీం బార్లు వేసామని అందులో 22 పోయినట్లు తెలిపారు నేటి సమస్య ఉన్న గ్రామాలకు దగ్గరగా ఉన్న రైతులు బోరు నుండి నీటిని అందించే ఏర్పాటు చేస్తామన్నారు తాసిల్దార్ సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీ జీవో వచ్చిందని త్వరలో భూములేని వారికి భూ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు ఎండ నిర్మాణం కొరకు 850 మంది చేసుకోగా వాటిలో 750 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసిసినట్టు తెలిపారు గుట్టపల్లె సర్పంచ్ చిదంబరం రెడ్డి మాట్లాడుతూ ఆర్కే నగర్ లో ఓ ఏరియాకి నీరు సక్రమంగా వదలడం లేదని పైపులను కట్ చేశారని ఆయన తెలిపారు ఉప మండల అధ్యక్షులు రవీంద్ర నాయుడు మాట్లాడుతూ సోమవారం గ్రామంలోనే అర్జునవాడ దేవళంపేటలో నీటి సమస్య ఉందని అధికారులు దృష్టి తీసుకొచ్చారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొర్ల కవిత ఎంపీడీవో రామచంద్ర ఎంపీటీసీలో అన్ని శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘటనపై నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

గాలివీడు, ఏప్రిల్ 26(ప్రభాతవార్త):



జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక నేతృత్వంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో స్థానిక ప్రజానీకం మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పహల్గాంలో అందమైన పర్యాటక ప్రదేశంలో ప్రకృతిని ఆస్వాదిస్తున్న అమాయక ప్రజలను మతం అడిగి మరీ తుపాకులతో కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అంటూ ఉగ్రదాదుల దాడిని ఖండించారు. అమాయకులను చంపి రాక్షసానందం పొందే తీవ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలని, ఈ విషయంలో మోదీ సర్కార్ కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మృతులకు నివాళులు అర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 29న మండల సర్వసభ్య సమావేశం

గాలివీడు, ఏప్రిల్ 26(ప్రభాతవార్త):

ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను వెంటబెట్టుకుని రావాలన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, మండల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

## ఆలయ భూముల కౌలుకు వేలం పాట

చిట్వేలి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:



చిట్వేలి గ్రామ పరిధిలోని శ్రీ సోమేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ వరదరాజస్వామి, శ్రీ వీరభద్ర స్వామి ఆలయ భూముల కౌలు సాగుకు మే 3 వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు రాజంపేట సమూహ దేవాదాయ ఎగ్జిక్యూటివ్ అధికారి కొండారెడ్డి తెలిపారు. శనివారం శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. వేలంపాటలో పాల్గొనేవారు 2000 ప్రవేశ రుసుము, దక్కించుకున్న వారు పదివేల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ వేలంపాట ఆరు సంవత్సరాల కాల పరిమితికి ఉంటుందని, మూడు సంవత్సరాల తదుపరి అప్పటి రుసుము కంటే 33 శాతం పెంపుదల ఉంటుందన్నారు. శ్రీ సోమేశ్వర స్వామి ఆంజనేయ స్వామి భూములకు ఉదయం 10 గంటలకు శ్రీ సోమేశ్వరం ఆలయంలో; శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ వరదరాజ స్వామి ఆలయ భూములకు మధ్యాహ్నం 2 గంటలకు శ్రీవరదరాజ స్వామి ఆలయంలో వేలంపాట ఉంటుందని అధికారి కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి జనార్ధన, శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ సమ్మెట వీరాంజనేయరాజు, అర్చకులు సతీష్, అరవింద్, పవన్ పాల్గొన్నారు.

## మర్రికుంటపల్లెకు హైస్కూలు మంజూరు

కలికిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ ఎల్లంపల్లె ఆఫ్ మర్రికుంటపల్లె ఎంపీ యూపీ పాఠశాల ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వం హైస్కూలు మంజూరు చేస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా హైస్కూలు మంజూరు చేయాలని స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ గ్రామ పెద్దలు ఎం. ఆనందరెడ్డి, ఎం.గంగాధరదేవర్, మాజీ పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎం.జయప్రకాష్, వెంకటపతి, కృష్ణారెడ్డి పలువురు స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో ఎమ్మెల్యే విద్యాశాఖాధికారులతో చర్చించి మర్రికుంటపల్లె పంచాయతీకి హైస్కూలు మంజూరు చేయించారు. మంజూరు కావడంతో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, ఎంపీటీసీ చిరంజీవమ్మ, గ్రామ పెద్ద లు చిన్నరెడ్డయ్య, శ్రీనివాసులు, చెన్నబసవ, మహేష్, పలువురు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



టిడిపి బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు ప్రతి పౌర్ణమి రోజున అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం కొర్రపాడు రోడ్డు పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గత మూడు సంవత్సరాలుగా చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి శనివారం పేదలకు అన్నదాన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగించడానికి తన శాయి శక్తుల కృషి చేస్తానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవి శంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బంగి శివప్రసాద్, టైలర్ ప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు, జయచంద్రయాదవ్, నల్లం రవిశంకర్, డ్రైవర్ బాషా, నేలటూరి దస్తగిరి, సునీల్, గోపవరం సుబ్బరాయుడు, హరీష్, రవి పాల్గొన్నారు.

## నేడు శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణోత్సవం

కురబలకోట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

కురబలకోట మండలం తెట్టులో వెలసిన శ్రీ సంతాన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కళ్యాణోత్సవం, బ్రహ్మ గరుడోత్సవం జరగనున్నది. ఆలయంలో ఇప్పటికే కార్యక్రమాలను సిద్ధం చేశారు. ఈ గరుడోత్సవానికి ఆలయం వద్ద కళ్యాణోత్సవం సత్యభామ రుక్మిణీల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తారు. జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

## పహల్గామ్ అమరులకు నివాళి

పీలేరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త :


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.టి.యు పీలేరు మండల శాఖ ఆధ్వర్యంలో పహల్గామ్‌లో టెర్రరిస్టుల దాడిలో అమరులైన భారతీయులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ పీలేరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు మండల అధ్యక్షుడు, మండల ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నాయకులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి, మండల కార్యకర్తలు పాల్గొని అమరుల త్యాగాలను స్మరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతథిగా హాజరయ్యారై మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎస్.టి.యు కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. నిశ్శబ్ద ప్రార్థనతో ప్రారంభమై, జైహింద్ నినాదాలతో ముగిసింది.

## పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం స్థల పరిశీలన

పీలేరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త:


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ హెచ్పీ బృందం

పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయతీ, సర్వేనెంబర్ 198లో ఐఓసీ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు రెవిన్యూ అధికారులు స్థల పరిశీలన చేశారు. శనివారం మండల తహశీల్దారు, రెవెన్యూ బృందం స్థల పరిశీలన తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఐఓసి పెట్రోల్ బంకు నిర్మలానికి తగిన స్థల ప్రతిపాదన చేశామన్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఐఓసీ సంస్థ ప్రతినిధులు ప్రతిపాదిత స్థలాన్ని చూపించామన్నారు. ఐఓసీ పెట్రోల్ బంకు ఇక్కడ ఏర్పాటైతే వాహనదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా అనుమతుల కోసం నివేదికను ఉన్నత అధికారులకు పంపుతామని తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, వీఆర్వో హేమంత్‌నాయక్ పాల్గొన్నారు.

## సిపిఐ ఎంఎల్ లిబరేషన్ వ్యవస్థాపక దినోత్సవం

బద్వేలు, ఏప్రిల్ 26(ప్రభాత వార్త ):



సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆ పార్టీ జిల్లా స్థాండింగ్ కమిటి సభ్యులు సంగటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబయ్య మాట్లాడుతూ 1974 వ సంవత్సరం పశ్చిమబెంగాల్లోని నగ్జల్ బరి ప్రాంతంలో భూస్వామ్య విధానానికి వ్యతిరేకముగా పార్టీ ఏర్పాటు అయిందన్నారు. పార్టీ ఏర్పాటు నాటి నుండి నేటి వరకు అనేక నిర్బంధాలను అధిగమించి రాజీలేని ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ ఈనాడు జాతీయస్థాయిలో వామపక్ష పార్టీలలో అగ్రగామిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్ రాజు, జకరయ్య విద్యార్థి సంఘం జిల్లా నాయకులు అనిల్ కుమార్, నియోజకవర్గ పార్టీ నాయకులు రామరాజు,కె.బాబు, విజయరావు, నారాయణ, రేనాటి శ్రీను, జయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు బద్రతా నియమాలు పాటించాలి..

వేంపల్లె ఏప్రిల్ 26,ప్రభాతవార్త:



ప్రతి ఒక్కరూ రోడ్డు బద్రతా నియమాలు పాటించాలని వేంపల్లె సిఐ టి.నరసింహులు సూచించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, సరైన పత్రాలు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రయాణాల్లో బద్రతా నియమాలు పాటించడం సురక్షితం, మీపై ఆధార పడ్డ కుటుంబానికి ఎంతో క్షేమకరం అన్నారు. బాధ్యత రాహిత్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. అంతేకాకుండా వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలని, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయవద్దని, నిభందనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుత దాడిలో మేకను నష్టపోయిన రైతుకు పరిహారం

నిమ్మనపల్లె, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండలం పరేశువారిపల్లెలో గత ఏడాది నవంబర్‌లో చిరుత దాడిచేసి మేకను చంపివేసింది. దానికి నష్టపరిహారంగా పరేశువారిపల్లెకు చెందిన రైతు గంగులప్ప కుమారుడు పి.రామయ్యకు శనివారం అటవీశాఖ అధికారులు జయప్రసాద్ రూ.7500లు డిడిని అందజేశారు. ఈ నష్టపరిహారం అందించిన వారిలో ఎఫ్ఆర్ఓతోపాటు డిఆర్ఓ జె.మదన్‌మోహన్, ఎఫ్‌బిఓ దీపలు కలరు.

# సాంస్కృతిక పరిరక్షణకు పర్యాటక రంగం అభివృద్ధి కీలకం



రాయచోటి, ఏప్రిల్ 26ప్రభాత వార్త

అన్నమయ్య జిల్లా ఆర్థిక అభివృద్ధికి మరియు సాంస్క ృతిక పరిరక్షణకు పర్యాటక రంగం అభివృద్ధి కీలకమని, ముఖ్యమైన పర్యాటక కేంద్రాలలో హోం స్టేల నిర్మాణం జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శని వారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని ని ర్వహించారు. ఈ సమావేశాన్ని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం ప్రారంభిస్తూ... జిల్లాలో చేపడుతున్న వివిధ పర్యాటక ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ఒక జిల్లా ఒక పర్యాటక ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టు, హార్స్లీ హిల్స్ లో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, అన్నమాచార్యుల వారి గురించి మరియు అన్నమాచార్య కీర్తనలను ప్రచారం చేయడం, రాయ చోటిలో శిల్పారామ నిర్మాణంలో ప్రగతి, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి పీలేరు మరియు రాజంపేటలలో నిర్మించబోయే మూడు నక్షత్రాల హోటళ్లకు ఒక్కొక్క చోట గుర్తించబడిన 5 ఎకరాల భూములను పర్యాటక శాఖకు అప్పగించే ది శగా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు. హార్సిలీ హిల్స్లోగిరిజన కార్పొరేషన్ వారు అరకు కాఫీ కోసం గుర్తించిన స్థలాన్ని గిరిజన కార్పొరేషన్కు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ను ఆదేశించారు. హార్స్లీ హిల్స్ లో లేపాక్షి స్టాల్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి పర్యాటక శాఖకు అందజేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలతో హోమ్ స్టే లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్డిఏను ఆదేశించారు. హో మ్ స్టే లను గుర్తించిన అనంతరం ఓయో మరియు ఇతర ఆన్లైన్ వెబ్సైటులకు లింక్ చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గుర్రం కొండ ఫోర్ట్, హార్స్లీ హిల్స్, వెలిగల్లు, కోడూరులోని రెడ్ వుడ్ పార్క్, తదితర పర్యాటక ప్రదేశాలలో సానిటరీ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేసేందుకు ఒక్కొక్క చో ట ఒక్కో సెంటును పర్యాటక శాఖకు అందజేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాయచోటి దగ్గర నిర్మించబడుతున్న శిల్పారామం నిర్మాణంలో పురోగతి సాధించాలని పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె రా జంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్ మరియు నైదియా దేవి, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఏపీ టిడిసి ఈ ఈ సుబ్రహ్మణ్యం, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, పిడి డిఆర్డిఏ సత్యనారాయణ ఏపీఎ స్ఆర్టీసీ జిల్లా అధికారి రాము, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వివిధ శాఖల జిల్లా అధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యార్థులకు గురువుల ప్రశంసలు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ను ప్రధానోపాధ్యాయులు డాక్టర్ నటరాజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్ర శంసించారు. ఆదివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కా ర్యక్రమంలో గురువులు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు పీలేరులో 2024,25 విద్యా సంవత్సరానికి జరిగిన టెన్త్ పరీక్షల్లో చరిత్రాత్మక విజయం సాధించి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని అన్నారు. పీలేరు మండల పరిధిలో 15 ప్రభుత్వ పాఠశాలలుండగా, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. భానుశేఖర్ రెడ్డి 581 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని అన్నారు. అలాగే ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా ఫలితాలు సాధించిన కె. హితేష్ 546, ఎస్. ఉజ్రకుస్లమ్ 544, బి. హ రిప్రియ 535, ఎస్. మదియా బాను 532, పిజి స్నిగ్ధ 529, ఎస్. తస్లీమ్ 528, ఎస్. సుహాన 523, ఈ. శరణ్య 516, ఎస్. సైదానీబీ 513, ఎస్. అతుఫా రహమత్ 506, ఎస్. మొహమ్మద్ ఫరూక్ 504 లను కూడా అ భినందించడం జరిగిందని అన్నారు. 1937లో స్థాపించిన ఈ పాఠశాల ఇప్ప టికీ వన్నె తగ్గకుండా ఇంతటి చరిత్రాత్మక విజయాలు సాధించడం గర్వకా రణమని తెలిపారు. ఎందరో మహాను భావులు ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో ఉన్నారంటూ గత స్మృతులను గుర్తు చేశారు. ఈ గొప్ప విజయం ఉపాధ్యాయుల నిరంతర కృషి, .పట్టుదల, విద్యార్థుల అంకిత భావం, క్రమ శిక్షణ వల్లనే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి తల్లి తండ్రులు భారతి, ఉత్తమ రెడ్డి, ఉపాధ్యాయులు శిరీష, లీలావతి, శశిదేవి, జీనత్, షరీఫున్నిస, నాగవేణి, యర్రయ్య, జనార్ధన్ రెడ్డి, శివకుమార్, రమణ, గౌస్, కిషోర్, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కళ్యాణం



పెనగలూరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. మండల మాజీ వైస్ ఎంపీపీ బచ్చల సుమ తమ్మ, టిడిపి నాయకుడు బి.ఎల్.నరసింహారెడ్డి దంప తుల ఆధ్వర్యంలో పి.సీ. సుబ్బ నరసయ్య పండితుల బృందం కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా ని ర్వహించారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయ కురాలు ముక్క వరలక్ష్మి పాల్గొని సీతారామ లక్ష్మణ ఆంజనేయుల ఉత్స వర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పెద్దలు యూత్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాలతో పాటు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోపాటు టిడిపి నాయకులు మాజీ డిసిసిబి డైరెక్టర్ లేబాక శ్రీనివా సరెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, జి రెడ్డయ్య రెడ్డి , ఎల్ రెడ్డయ్య, వి.పా లిరెడ్డి, కే కళాచంద్ర, ఎం విశ్వనాథరెడ్డి, బచ్చల వేణుగోపాల్ రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

## పదిఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదిఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులను హెచ్ఎం సుబ్బారెడ్డి, రూటా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ ఖాన్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం పాఠశాలలో 500పై గా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా హె చ్ఎం సుబ్బారెడ్డి, మహ్మద్ఖాన్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటడం అభినందనీయమన్నారు. ఎన్.శ్రావణి 600 మార్కులకు గాను 580 మార్కులు, తేజ్కిరణ్ 578 మార్కులు, జహీర్ఖాన్ 577 మార్కులు, రోహిత్ 575 మార్కులు, షాబానా 571 మార్కులు, కవి తాదేవి 570 మార్కులు సాధించగా, 500లకు పైగా 40 మంది విద్యార్థులు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను వారు అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని వచ్చే విద్యాసంవత్సరంలో పరీక్ష రాసే విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ఆర్వి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవీ విరమణకు ఒక రోజు ముందు సంపాదించిన ఇంక్రిమెంట్ థర్డ్ పార్టీలకు వర్తిస్తుంది

(ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

ప్రభుత్వ ఉద్యోగులు తమ రిటైర్మెంటుకు ముందు రోజు ఆర్జించిన ఇంక్రిమెం ట్కు అర్హులని డైరెక్టర్ (అడ్మిన్ అండ్ హెచ్ఆర్) కర్ణాటక పవర్ ట్రాన్స్మిషన్ కార్పోరేషన్ లిమిటెడ్ మరియు ఎదిరి సి.పి.ముండినామని వ్యాజ్యములో ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను భారత అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ధృవీకరిస్తూ తీర్పు వెలువడిన తేదీ నుండి అనగా 11.4.2023 నుండి థర్డ్ పార్టీకి వర్తిస్తుందని న్యాయ స్థానం సుస్పష్టం చేసింది. అంటే 01.5.2023 తరువాత మరియు తర్వాత ఒక ఇంక్రిమెంట్ పరిగణన లోనికి తీసుకోవడం ద్వారా పెన్షన్ చెల్లించాలి. 30.4.2023 ముందు కాలానికి పెంచిన పెన్షన్ చెల్లింపబడదు. జ స్టిస్ సంజీవ్ కన్నా, సంజయ్ కుమార్లతో కూడిన ధర్మాసనం 2024 సెప్టెం బర్ 6న మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. (ఎ) 11.4.2023 నాటి తీర్పు అదే తేదీ నుండి థర్డ్ పార్టీ విషయంలో అమలు లోనికి వస్తుందని, అంటే ఒక ఇంక్రిమెంట్ను పరిగణన లోనికి తీసుకుని లెక్కించిన పెన్షన్ 01.5.2023 నుండి చెల్లింపబడుతుందని 30.4.2023 ముందు కాలానికి పెంచిన పెన్షన్ చెల్లింపబడదనిన్నీ, (బి) రిట్ పిటీషన్లు దాఖలు చేసి గెలిచిన వ్యక్తులకు పేర్కొన్న తీర్పులో ఇచ్చిన ఆదేశాలు 'రెస్ జ్యుడికాటా' వర్తిస్తాయని, తదనుగుణంగా ఒక ఇంక్రిమెంట్ పరిగణన లోనికి తీసుకోవడం ద్వారా పెంచినర పెన్షన్ చెల్లిం చవలసి వుంటుందని, (సి) తీర్పు అంతిమ స్థితికి చేరుకోని లేదా అప్పీలుకు వెళ్ళాలనుకున్నా లేదా అప్పీలు దాఖలు చేసిన వ్యాజ్యాల (బి) లోని ఆదేశం వర్తించదని (డి) ఏదైనా రిటైర్డ్ ఉద్యోగి సివిల్ అప్పీల్ నెం.3933/2023 లేదా ఏదైనా ఇతర రిట్ పిటీషన్లో ఇంప్లీడ్మెంట్ కోసం దరఖాస్తు దాఖలు చేసుకు న్నట్లయితే ప్రయోజనకరమైన ఉత్తర్వు ఆమోదించబడినట్లయితే సదరు దరఖా స్తు దాఖలు చేసిన నెల నుండి ఒక ఇంక్రిమెంట్తో కలిపి లెక్కించిన అధిక పెన్షన్ చెల్లింపబడుతుందని తే.20.02.2025 దీన సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశాలు (ఎ) (బి) మరియు (సి) మరియు సవరించిన (డి) ని నిర్ధారించాయి. సవరించిన (డి) ఇలా వుంది. "(డి) ఏదైనా ఉద్యోగి ఇంప్లీడ్మెంట్/ రిట్ పిటీషన్/ ఒరిజనల్ అప్లికేషన్ కొరకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్/ హైకోర్టులు/ ఇ-కోర్టులో దరఖాస్తు చేసినట్లయితే సదరు దరఖాస్తు కోసం దాఖలు చేసిన అసలైన నెలకు ముందు 3 సంవత్సరముల కాలమునకు ఒక ఇంక్రిమెంటుతో కలిపి మెరుగుపరుచబడిన పెన్షన్ చెల్లించబడుతుంది. యూనియన్ ఆఫ్ ఇండి యా మరి ఒకరు ఎదిరి యం.సిద్ధరాజు వ్యాజ్యములో నిర్ణయం తరువాత ఎవరైనా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి క్యాట్ ముందు రిట్ లేదా ఒరిజనల్ అప్లికేషన్ లేదా ఇంప్లీడ్మెంట్ దాఖలు చేసినట్లయితే 19.5.2023 నాటి ఆదేశం(ఎ) ప్రకా రం పరిష్కరించబడుతుంది. (డి) ఆదేశం వర్తించదని బెంచి సుస్పష్టం చేసింది. ఒకవేళ బకాయిలతో సహా ఏదైనా అదనపు చెల్లింపు అది వరకే జరిగి వున్నట్ల యితే ఆ మొత్తం తిరిగి రాబట్టుకోబడదు అని తెలిపింది. ప్రస్తుత ఆదేశాలు పాటించకపోవడం వల్ల ఎవరైనా నష్టపోతే సంబంధిత అధికారులను సంప్రదిం చడానికి కూడా న్యాయ స్థానం స్వేచ్ఛను ప్రసాదించింది. అవసరమైతే బాధిత పక్షం చట్ట ప్రకారం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ లేదా హైకోర్టును ఆశ్రయించవచ్చు ను. యం.సిద్ధరాజు వ్యాజ్యములో జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ సంజయ్ కుమార్లతో కూడిన ధర్మాసనం సి.పి.ముండినామణి కేసులో అంశాల పైనే విచారిస్తున్నందున సి.పి.ముండినామణి కేసులోని నిర్ణయమే అప్పీళ్ళన్నిటికీ వర్తిస్తుందని కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొనింది. సి.పి.ముండినామణి వ్యాజ్యములో మరుసటి రోజు పదవీ విరమణ చేస్తారనే కారణంతో కేపీటీసీఎల్ తన ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్ను నిరాకరించింది. కర్ణాటక ఎలక్ట్రిసిటీ బోర్డు ఎంప్లాయిస్ సర్వీస్ రెగ్యులేషన్స్ 1997 లోని రెగ్యులేషన్-40(1) పై ఆధారపడి ఈ నిర్ణయం తీసుకుంది. ఇంక్రిమెంట్ అనేది సంపాదించిన మరు సటి రోజు నుండి అమలవుతుంది, ఇంక్రిమెంట్ వచ్చిన రోజున సదరు ఉద్యో గులు సేవలో లేరని వాదించింది. ఈ వాదనను హైకోర్టు తిరస్కరించడంతో కేపీ టీసీఎల్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ ఉద్యోగులు కేవలం ఇంక్రిమెంట్ పొందిన మరుసటి రోజే పదవీ విరమణ చేయనున్నందున వార్షిక ఇంక్రిమెం ట్ను తిరస్కరించలేమని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొనింది. (యూనియన్ ఆఫ్ ఇండియా మరి ఒకరు ఎదిరి యం.సిద్ధరాజు, అప్లికేషన్ డైరీ నెం.2400 ఆఫ్ 2024, సివిల్ అప్పీల్ నెం.3933 ఆఫ్ 2023)

# వైభవంగా కాల గంగమ్మ తిరుణాల

అధిక సంఖ్యలో భక్తులు హాజరు:



ఒంటిమిట్ట ఏప్రిల్ 26( ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఒంటిమిట్ట తూము వద్ద వెలసిన కాల గంగమ్మ తల్లికి గ్రామ ప్రజలు శుక్రవారం, శనివారం తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భం గా నిర్వాహకులు ఆలయాన్ని మనంగా అలంకరించారు.. అనంతరం అమ్మ వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో, పుష్పాలతో ఆ భరణాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. కాల గంగమ్మ తిరుణాల సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

### ప్రజల సమక్షంలో ఎద్దుల పోటీలు:



మండల కేంద్రమైన ఒంటిమిట్ట తూము వద్ద వెలసిన కాల గంగమ్మ తల్లికి గ్రామ ప్రజలు శుక్రవారం, శనివారం రెండు రోజులపాటు తిరుణాల నిర్వహిం చారు. తిరుణాల సందర్భంగా నిర్వాహకులు ఎద్దుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చుట్టుపక్కల ప్రాంతాల ఎద్లు పాల్గొన్నాయి. ఎద్దుల బండ పో టీలలో గెలుపొందిన వృషభరాజముల యజమానులకు ఆలయ కమిటీ బహు మతులు ప్రధానం చేయడం జరిగింది. ఎద్దుల పోటీలకు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చి ఆసక్తిగా వీక్షించారు. ఎద్దుల పోటీలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ఆదే శాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ పర్యవేక్షణలో స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

## పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించండీ



బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని మహబూబ్నగర్లో మునిసిపల్, సచివాయాలసిబ్బందితో కలసి మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలన్నారు. నీటి సరఫరా,వీధి లైట్లు ఎ ప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ సమస్య లేకుండా చూడాలని ఇంజనీరింగ్ సిబ్బంది కి సూచించారు. అలాగే వాటర్ లీకేజీ లు జరిగితే సిబ్బంది ఎప్పటికప్పుడు చ ర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమకుళాయి లు తక్షణమే రెగ్యులర్ చే యించుకోవాలని లేని యెడల కుళాయి కనెక్షన్ లు తొలగిస్తామన్నారు. అలాగే చెత్త బయట వేయకుండా కేటాయించిన చెత్త సేకరణ వాహనాల్లోనే వేస్తూ పట్ట ణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ తోడ్పడవలసినదిగా విజ్ఞప్తి చేయడమైనదని కోరా రు. రోడ్డు మీదకు వచ్చే విధంగా కట్టడాలు కట్టరాదన్నారు. ఈ కార్యక్రమ ములో కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, మునిసిపల్ అసి స్టెంట్ ఇంజనీర్ మహేష్, మునిసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి ఘటనలో కేసు నమోదు..

సుండుపల్లె, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సొర్నంత వారి పల్లె గ్రామపంచాయతీ , కొండల తూర్పు గ్రామంలో ఇంటి గోడను కూల్చాడని స్థానిక పోలీస్ స్టేషన్లో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొండల తూర్పు గ్రామంలో విశ్వ నాథ్ నివసించే ఇంటి గోడను రవి అనే వ్యక్తి కూల్చివేశాడని శనివారం విశ్వ నాథ్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు రవి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

## 30న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్

కలికిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:

డిప్లొమా కోర్సులో అడ్మిషన్ల కోసం ఈనెల 30వ తేదీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్-2025)ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ డా. ఎస్.శ్రీనివాసులు తెలిపారు.

### ఉగ్రవాదుల చర్యను నిరసిస్తూ

# అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



బద్వేలు అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

పాకిస్తాన్ ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ పట్టణంలోని నెల్లూరు నెల్లూరు రో డ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎంఆర్పిఎస్ కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కా శ్మీర్ లోని పహల్గాంలో జరిపిన కాల్పులకు ఉగ్రవాద పాకిస్తాన్ చర్య బాధాకర మన్నారు. ఇది పిరికిపందచర్య అని పేర్కొన్నారు.. అనంతరం పాకిస్తాన్ డౌన్ డౌన్ అనే నినాదాలు చేశారు. అనంతరం మాదిగ ఉద్యోగుల సమాఖ్య నియో జకవర్గ అధ్యక్షులు ఎర్రబల్లె ఓబయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి, అమరులకి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాదిగ ఉ ద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు దేవానందం, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య, పూలే అంబేద్కర్ రా జ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, ఇసుకల జై చంద్రబాబు, దళిత నాయకులు, బత్తల కూరి కేశవయ్య, ఆనందరావు, సుంద ర్ రావు, జగన్మోహన్, జై చంద్ర, వీరయ్య, రవి, రాజేంద్రప్రసాద్, జాల రాజ న్న, నాగిపోకు ప్రసాద్, సుందర్, ప్రభుదాస్, సత్యం, చైతన్య, విజయ్, కృష్ణ య్య తదితరులు పాల్గొన్నారు.

## జీవిఐసి బిఈఎస్ స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు

కురబలకోట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

అంగళ్ళుకు సమీపంలోని గోల్డన్వ్యాలీ బిఈఎస్ మోడల్ హైస్కూల్లో వా ర్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్డన్వ్యాలీ విద్యాసంస్థల అధినేత ఎన్వి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ఈ స్కూల్లో మంచి ఫలితాలను సాధిస్తున్నామని అ మలు చేస్తున్న పలు కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నట్లు ఆ యన తెలిపారు. ఈ పాఠశాలలో నిర్వహించే సమ్మర్క్యాంపులకు ఈ పాఠశాల విద్యార్థులే కాకుండా ఏ పాఠశాలలకు చెందిన విద్యార్థులైనా పాల్గొనవచ్చునని తెలిపారు. కరస్పాండెంట్ రమణారెడ్డి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహు మతులను అందజేశారు. పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆక ట్టుకొన్నాయి. ఈకార్యక్రమంలో సిబిఎస్ఈ స్కూల్ డైరెక్టర్ ఎన్పి.రావు, ఉపా ధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కతిక కార్యక్రమాలు

## వైభవంగా ముగిసిన చైత్రమాస పూజా కార్యక్రమాలు





గోపవరం, ఏప్రిల్ 26 , ప్రభాతవార్త

నియోజవర్గం గోపవరం మండలం వల్లెరవారిపల్లె గ్రామంలో వెలిసిన స్వ యంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి, వచ్చిన భక్తులకు స్వామివారి తాంబూల అందించడం జరిగినది. తదుపరి ఆలయ పూజారి మాట్లాడుతూ వైశాఖమాసం ఆరంభంతో లక్ష్మీనరసింహస్వామి వారి దీక్ష,మహాపాద యాత్ర ఉంటుందని, స్వామివారి దీక్ష తీసుకోవాలనుకున్న భక్తులు 3 వ తేది నుంచి దీక్ష కార్యక్రమం మొదలు అవుతుంది అని 41 రోజు స్వామి వారి దీక్ష లో ఉండి స్వామి వారి మహా పాద యాత్ర ఉంటుంది అని, మొట్టమొదటిసారిగా నియోజవర్గంలో ము నుపు ఎనడు లేనివిధంగా స్వామి వారి మహా పాద యాత్ర ఉండబోతుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు ఈ యాత్ర స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుండి పెనుశిల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి (పెంచ లకోన) ఆలయం వరకు కొనసాగుతుంది అని పేర్కొన్నారు.స్వామివారి దీక్ష మహా పాదయాత్ర పాల్గొన్న దలచినవారు ఆలయ పూజారిని సంప్రదించవ లసినదిగా ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. తదనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించడం జరిగినది అన్నదాన, పూజ కైంకర్యం నిర్వహించినవారు, వల్లెర వారి పల్లె గ్రామానికి చెందిన బండి. ఓబయ్య సతీమణి చిన్నక్క కుమార్తె సాలమ్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తు లు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ కాగడాల ప్రదర్శన

మదనపల్లె, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

జమ్మూకాశ్మీర్లోని పవాల్గామ్లో జరిగిన ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ పట్టణంలో అఖిలపక్షం నాయకులు శనివారం రాత్రి కాగడాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సొసైటికాలనీలోని పార్కు వద్ద ఉన్న వివేకానంద వి గ్రహం నుంచి ఎన్టిఆర్ సర్కిల్, పటేల్రోడ్డు, మల్లికార్జునసర్కిల్, బెంగుళూరు బస్టాండు, అవెన్యూ రోడ్డుల మీదుగా మున్సిపల్ కార్యాలయ ఆవరణం వద్ద ఉన్న భరతమాత విగ్రహం వరకు కాగడాలతో ప్రదర్శనగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్, కురవంక సర్పంచ్ పసు పులేటి చలపతి, విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బిజెపి నాయకులు బండి ఆనంద్, కామకోటి ప్రసాద్రావు, సాయిశేఖర్రెడ్డి, పిలస్వామి నాయక్, దారం అనిత, ఎమ్మార్పీఎస్ నరేంద్ర, వెంకటరమణారెడ్డి, భగవాన్లు మాట్లాడుతూ దేశంలో పర్యాటక కేంద్రం, మినీ సిజర్లాండ్గా పేరుపొందిన పహల్గామ్లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అ న్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవా లన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాక్షించారు. దాడుల్లో క్షతగాత్రులు అయిన వారు త్వరగా కోలుకోవాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతులకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నివాళులు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

పీలేరు ఏప్రిల్ 26 ప్రభాతవార్త :

కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో మృతులకు ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గం ఎం ఎస్ పి ఇన్చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శాంతియుతంగా మైనపువర్తులు వెలి గించి నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి తెలు గుదేశం పార్టీ, జనసేన, ముస్లిం మైనార్టీ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంఘం ఐక్యవేదిక నాయకులు సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా పీలేరు పట్టణం బండ్లవంకలో నూతనంగా వెలిసిన శ్రీ మాతమ్మ తల్లి ఆల యంలో మృతులకు ఆత్మ శాంతి చేకూరాలని పూజలు చేసిన అనంతరం కోట పల్లి వివేకానంద సర్కిల్ నందు మృతుల చిత్రపటాల వద్ద కొబ్బరికాయలు కొట్టి మైనపు వత్తులు వెలిగించి మోనం పాటించి నివాళులర్పించారు అనం తరం టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డి రమేష్ బాబు, టిడిపి రాష్ట్ర బీసీ సాధికార సమితి కార్యదర్శి పురం రామ్మూర్తి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కలప రవి ఎంఎస్పి పీలేరు నియోజకవర్గంలో చార్జి గండుకోట వెం కటేష్ లు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి ఏ వర్గానికి చెందినవారు కాకుండా కేవలం కుటుంబ సభ్యులతో విశ్రాంతి తీసుకుని ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన టూరిస్టులపై కాశ్మీర్ ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్చి చంపడం చాలా దారుణమని ఇటువంటి దారుణానికి వడిగట్టిన ముష్కరులను గుర్తించి ఆ దేశానికి తగిన గుణపాఠం తో పాటు ముష్కర్లను కఠినంగా శిక్షిం చాలన్నారు భారతదేశంలో హిందూ ముస్లిం భాయి భాయి అనుకుంటూ ప్ర శాంత వాతావరణంలో మనుగడ సాగిస్తున్నారని ఇలాంటి ముష్కరుల వల్ల మ తకల్లోహాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయి ఇలాంటి వాటిని ఆదిలోనే అంత మొందించాలని తెలిపారు ఈ దాడిని మేము సంయుక్తంగా ఖండిస్తు న్నామన్నారు ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనాథ్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, జయ చంద్రారెడ్డి, అమ ర్నాథ్ రెడ్డి, మైనారిటీ నాయకులు నల్లారి రియాజ్, చాంద్ భాషా, నల్లారి ఫై రోజ్, టిడిపి నాయకులు నరేష్ రెడ్డి, మిట్ట శివ, గాండ్ల విజయకుమార్, ఎస్సీ నాయకులు రమేష్ బాబు, ఎస్సీ నాయకులు కప్పరం చంద్రయ్య, ఎం ఆర్ పి ఎస్, ఎంఎస్పి సీనియర్ నాయకులు బండ్ల వంక పివి రమణ, పెద్ద రమ ణ, తంగేళ్ల రమణ యువ నాయకులు నరసింహ, రాజేష్, నరేష్, ఆనంద, రాము, గంగాధర, హరీష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేసిన రితేష్ రెడ్డి

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి చేతుల మీదుగా పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం లాంటిదని అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ నాయకులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, రితీష్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీ బిజివేముల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు

